సాక్షి
ఖమ్మం

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



అత్యున్నత స్థాయికి ఎదగాలి

విద్యార్థుల్లో క్రీడల్లో రాణిస్తూ అత్యున్నత స్థాయికి ఎదగాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. 8లో



అయోధ్య అక్షింతల శోభాయాత్ర

శ్రీరామ జన్మభూమి అయోధ్యకు తీసుకెళ్తున్న అక్షింతల శోభాయాత్ర జిల్లా కేంద్రంలో ఘనంగా కొనసాగింది. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 19°

వాతావరణం

జిల్లా అంతటా ఆదివారం చలిగాలుల ప్రభావం ఉంటుంది. సాయంత్రం తర్వాత ఈ తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున అర్చకులు శ్రీవారి పాదంతో పాటు మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే, స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించారు. వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

22న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

ఖమ్మం స్పోర్ట్స్: యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన ఈనెల 22వ తేదీన జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని యువ కళాకారులను ప్రోత్సహించాలనే భావనతో ఈ పోటీలు నిర్వహిస్తుండగా, ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జానపద నృత్యం(గ్రూప్, సోలో), జానపద పాట(గ్రూప్, సోలో), వ్యాస రచన, పోస్టర్ తయారీ, వక్తృత్వం అంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 21వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో కానీ, 99482 07271 నంబర్‌లో కానీ సంప్రదించాలని డీవైఎస్‌ఓ సూచించారు.

నేడు, రేపు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

ఖమ్మంమయూరిసెంటర్: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆది, సోమవారాల్లో ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తెలిపా రు. ఖమ్మంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండురోజుల పాటు జరిగే సమావేశాల్లో వివిధ అంశాలపై చర్చిస్తామని తెలిపారు. ప్రధానంగా విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. నాయకులు రాజు, ఫర్వీన్, సాయి, వీరేందర్, సరళ, షరీఫా, నవ్య, వెంకటేశ్, రాగిణి, ఉమేష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ముక్కోటి టికెట్ల విక్రయం

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ముక్కోటి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఉత్తర ద్వారదర్శనం కోసం ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం ముమ్మరంగా సాగుతోందని ఈఓ రమాదేవి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా టికెట్ల విక్రయాన్ని ఈనెల 22న ప్రారంభించారు. ఇప్పటివరకు వీఐపీ టికెట్లు 600లో 352, సెక్టార్‌-ఏ 300కు గాను 189, సెక్టార్‌-బీ టికెట్లు 650కి 136, సెక్టార్‌-సీ టికెట్లు 100కి 100, సెక్టార్‌-డీ 125కి 108, సెక్టార్‌-ఈ 500 టికెట్లకు గాను 142 టికెట్లను భక్తులు కొనుగోలు చేశారని ఈఓ తెలిపారు.

78,515 మందికి ‘రైతుబంధు’

ఖమ్మంవ్యవసాయం: రైతుబంధు పథకం ద్వారా జిల్లాలో శనివారం నాటికి 78,515 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.19.16 కోట్ల నిధులు జమ అయ్యాయి. ఈ నెల 12 నుంచి యాసంగి రైతుబంధు పథకాన్ని ప్రభుత్వం అమలుచేస్తోంది. ఎకరాకు రూ.5 వేల చొప్పున చెల్లించనుండగా, జిల్లాలో 3,42,799 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. వీరి కోసం రూ.370.29 కోట్లు మంజూరు చేయగా భూవిస్తీర్ణం ఆధారంగా నగదు జమ చేస్తున్నారు.

బాలికల హాస్టల్‌లో అసిస్టెంట్ కలెక్టర్ తనిఖీ

తల్లాడ: తల్లాడలోని బాలికల హాస్టల్‌ను అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ రిజిస్టర్, స్టాక్‌ను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. అలాగే, విద్యార్థినులకు అందుతున్న మెనూ వివరాలు అడగగా.. అంతా సక్రమంగానే ఉందని బదులిచ్చారు. అయితే, హాస్టల్ చుట్టూ కోతుల సమస్య తీవ్రంగా ఉండడంతో విద్యార్థినులు బయటకు రావాలంటే భయపడుతున్నారని హాస్టల్ మ్యాట్రిన్ సుజాత తెలిపారు. ఆ సమయాన అక్కడకు వచ్చిన విద్యార్థినుల తల్లిదండ్రులతో కూడా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడారు. ఎంపీడీఓ కొండపల్లి శ్రీదేవి, హాస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని ఈ యాసంగిలో పంటల సాగుకు ఇబ్బందులు తప్పేలా లేవు. జిల్లాలోని 17 మండలాల పరిధిలోని 2.54 లక్షల ఎకరాలకు పైగా అధికారికంగా సాగర్ ఆయకట్టు ఉంది. అనధికారికంగా మరో 20వేల నుంచి 30 వేల ఎకరాల పంటలు సాగు చేస్తున్నారు. కానీ ఈ ఏడాది సరైన వర్షాలు లేక నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లోకి నీరు చేరలేదు. దీంతో ఖరీఫ్ సీజన్‌లోనే ఆయకట్టుకు అంతంత మాత్రంగా నీరు విడుదల చేయగా... యాసంగిలో క్రాప్ హాలీడే ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది. – ఖమ్మం అర్బన్



పాలేరు రిజర్వాయర్‌లో అడుగంటుతున్న జలాలు

సాగేనా... ఆగేనా?!

సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల సందిగ్ధమే

- ఖరీఫ్‌లోనూ అరకొరగానే సరఫరా...
- యాసంగిలో అదీ కష్టమేనంటూ ప్రచారం
- రిజర్వాయర్లలో అడుగంటుతున్న జలాలు
- రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం

కళకళ.. వెలవెల

సాగర్ ఆయకట్టు అంటే ఒకప్పుడు పంట గ్యారంటీ అనే నమ్మకం ఉండేది. సాగర్ నీటి సరఫరాతో ఆయకట్టు ఎక్కడ చూసినా పచ్చదనంతో కళకళలాడేది. సాగర్ నుంచి జిల్లాలో ఖరీఫ్, యాసంగి పంటల కోసం సుమారు 60 టీఎంసీల మేర నీటిని ఏటా విడుదల చేస్తారు. దీంట్లోనే లిఫ్టులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమలకు కూడా వినియోగిస్తారు. కానీ ఈ ఏడాది ఆరంభంలోనే సాగర్ డ్యామ్‌కు సరిపడా నీరు చేరక విడుదలపై అధికారులు ప్రకటన చేయలేదు. దీంతో రైతులు అనుమానంగానే బోర్లు, బావుల ఆధారంగా వరి నాట్లు వేశారు. సీజన్ మధ్యలో వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోతుండగా అధికారులు సుమారు 10 టీఎంసీల మేర నీటిని వారబందీ విధానంలో మూడు తడులుగా విడుదల చేశారు. అయినా ఆయకట్టు చివరి భూములు ఎండిపోయినా, మొదట్లో ఉన్న పంటలకు కొంత మేర ఉపయోగం జరిగింది. కాగా, సాగర్ ఆయకట్టు పరిధిలోని 2.54 లక్షల ఎకరాల్లో బోర్లు, ఇతరత్రా ప్రత్యామ్నాయ వనరుల ఆధారంగా వరి సహా ఇతర పంటలను రైతులు సుమారు 1.86లక్షల ఎకరాల్లో సాగు చేశారని అంచనా.

నీటిమట్టం వివరాలు (అడుగుల్లో)

డ్యామ్ / రిజర్వాయర్	పూర్తిస్థాయి నీటిమట్టం	ప్రస్తుతం
నాగార్జునసాగర్	590	522
పాలేరు	23	18.5
వైరా	18	14.5

(పాలేరులో నీటిమట్టం 13 అడుగుల దిగువకు పడిపోతే ఎట్టి పరిస్థితుల్లో నీరు విడుదల చేసే అవకాశముండదు. వైరా రిజర్వాయర్‌లో 9 అడుగుల తర్వాత నీటిని తాగు అవసరాలకు తప్ప సాగు అవసరాలకు విడుదల చేయరు)

ఉన్నతాధికారులు నిర్ణయిస్తారు..

సాగర్ డ్యాంలో నీటి నిల్వలు డెట్ స్టోరేజీకి చేరాయి. ఇలాంటి పరిస్థితిలో సాగర్ ఆయకట్టు పరిధిలో యాసంగి పంటలు సాగు చేయడానికి నీరు విడుదల అనేది మా పరిధిలో ఉండదు. ఏ నిర్ణయమైనా ఉన్నతాధికారులే నిర్ణయించి త్వరలో వెల్లడించే అవకాశముంది.

– విద్యాసాగర్, సీఈ, జలవనరులశాఖ

యాసంగి అంతేనా ?

సాగర్ ఆయకట్టులో వేసవి సాగుకు నీటి విడుదల అనుమానాస్పదంగానే కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిని పరిశీలిస్తే అసాధ్యమేనని చెబుతున్నారు. రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలు తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతాయని.. తద్వారా సాగుకు విడుదల చేయకపోవచ్చనేది అధికారుల భావన. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలో యాసంగి సాగు అగమ్యగోచరంగా మారింది. ఫలితంగా రైతులు బోర్లు, బావుల ద్వారా ఆరు తడి పంటలైనా సాగు చేస్తారా.. మొత్తమే సాగుకు సెలవు ప్రకటిస్తారా అనేది వేచిచూడాలి.

పదేళ్ల తర్వాత..

2013–14 ఏడాదిలో సాగర్ ఆయకట్టుకు సాగు నీటి కష్టాలు ఎదురయ్యాయి. ఆ ఏడాది ఖరీఫ్, వేసవి పంటల సాగుకు సాగర్ నీటిని విడుదల చేయలేదని జలవనరుల శాఖ అధికారుల ద్వారా తెలిసింది. అంతకుముందు 2004–05 ఏడాదిలోనూ ఇలాంటి పరిస్థితే ఎదురైందని సమాచారం. మళ్లీ పదేళ్ల తర్వాత ఇప్పుడు అదే సమస్య పునరావృతమవుతోంది. ఇప్పటికే ఖరీఫ్ పంటకాలం కోల్పోగా... యాసంగి పంటలకూ నీరు వచ్చే అవకాశం లేదని తెలుస్తుండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

బోర్ నీటితో రక్షించుకున్నాం..



సాగర్ ఆయకట్టు అనే పేరే తప్ప ఎప్పుడూ కష్టాలే. ఈ ఖరీఫ్‌లో నీరు లేక వరి ఎండిపోయింది. మిర్చి, పత్తి పంటలను బోర్ నీటితో రక్షించుకున్నాం. యాసంగి పరిస్థితి తెలియట్లేదు. పదేళ్ల క్రితం కూడా ఇలానే రెండు పంటలకు నీరు విడుదల చేయలేదు.

– సూర్యదేవర సాంబశివరావు, అల్లీనగరం, మధిర మండలం

కరువు వచ్చినట్లుగానే ఉంది...



నీరు విడుదల చేయకపోతే సాగు ప్రశ్నార్థకంగా మారుతుంది. మా ప్రాంతంలో సాగు భూములు బీళ్లుగా మారి కరువు పరిస్థితి కనిపిస్తోంది. వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటాయి. ఖరీఫ్‌కు నీరందక నష్టపోగా ఇప్పుడు పెట్టుబడికి కూడా డబ్బు లేదు.

– నర్సింశెట్టి లక్ష్మీనారాయణ, మత్కేపల్లి, చింతకాని మండలం

మూడెకరాలు బీడు...



ఖరీఫ్‌లోనే నాకు ఉన్న మూడెకరాల భూమి బీడు అయింది. సాగర్ నీరు వదలక మా ప్రాంతానికి నీటి సరఫరా చేసే రాపల్లి మేజర్ పరిధిలో వందలాది ఎకరాలు బీళ్లుగా వదిలేశారు. బోర్లు ఉన్న కొందరు మొక్కజొన్న వేశారు. ఆ పంట కూడా చాలా మంది నష్టపోయారు.

– వేములకొండ రమేష్, పెద్ద మునగాల, కొణిజర్ల మండలం

అర్హులందరికీ ఓటు హక్కు

- ఎస్‌ఎస్‌ఆర్ పకడ్బందీగా చేపట్టాలి
- కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: వచ్చే జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండే ప్రతీ ఒక్కరికి ఓటుహక్కు కల్పించేలా యంత్రాంగం కృషి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఫొటో ఎలక్టోరల్ రోల్ స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్‌ఎస్‌ఆర్) అమలుపై కలెక్టరేట్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రెయినీలకు ఏర్పాటుచేసిన శిక్షణలో కలెక్టర్ మాట్లాడారు. నియోజకవర్గ స్థాయి ట్రెయినీలు నియోజకవర్గాల్లో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. బూత్ లెవల్ అధికారులుగా అంగన్‌వాడీ టీచర్లు ఉండి సాంకేతికంగా వెనుకబడితే పంచాయతీ కార్యదర్శులను నియమించాల్సి ఉంటుందన్నారు. ఓటర్లకు ఎన్నికల సంబంధ సమాచారం చేరవేసేలా ఫోన్‌నంబర్లు సేకరించాలని, ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రెయినీలు కె.శ్రీరామ్, మదన్ గోపాల్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

డేటా నమోదులో లోటుపాట్లు ఉండొద్దు

ఖమ్మంవన్‌టౌన్: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు గాను సిబ్బంది వివరాల నమోదులో లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సిబ్బంది డేటా నమోదు చేస్తుండగా ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 589 గ్రామపంచాయతీలు, 5,398 వార్డులు ఉండగా వార్డుల్లో ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, డీఈఓ సోమశేఖరశర్మ, కలెక్టరేట్ ఏఓ అరుణ, డీఎల్‌పీఓ పుల్లారావు, ఈడీఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు బెంచ్‌ల ఏర్పాటు

ఖమ్మంలీగల్: ఈనెల 30వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనుండగా, వివిధ కేసుల పరిష్కారానికి గాను ఖమ్మంలో బెంచ్‌లు ఏర్పాటుచేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీ వన్ కుమార్ ఆదేశాల మేరకు న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. మోటారు ప్రమాద కేసులు, జిల్లా కోర్టులకు సంబంధించిన సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి పరిష్కరిస్తారు. సీనియర్ సివిల్‌జడ్జి కోర్టుల లోక్ అదాలత్, సంబంధిత ప్రీ లిటిగేసన్ కేసులను అదనపు సీనియర్ సివిల్‌జడ్జి కె.ఆశారాణి అధ్యక్షతన ఏర్పాటయ్యే బెంచ్ పరిష్కరిస్తుంది. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కేసులు, సంబంధిత ప్రీ లిటిగేషన్ కేసులను ప్రధాన జూనియర్ సివిల్‌జడ్జి పి.గోపికా నాగశ్రావ్య, మొదటి అదనపు మెజిస్ట్రేట్ కోర్టు కేసులను న్యాయమూర్తి కె.దీప, రెండు, మూడో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు కేసులను న్యాయమూర్తి వి.మాధవి, మొబైల్ కోర్టు, ఎక్సైజ్ కోర్టు కేసులను న్యాయమూర్తి ఆర్.శాంతిలత పరిష్కరించనున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.కృష్ణారావు ఆధ్వర్యాన పలువురు న్యాయవాదులు లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరిస్తారు.

నేడు గ్రంథాలయ ప్రారంభోత్సవం

రూ.2కోట్ల సొంత నిధులతో నిర్మించిన ఎంపీ పార్థసారధిరెడ్డి

సత్తుపల్లి: రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి రూ.2 కోట్ల సొంత నిధులతో వైట్‌హౌస్‌ను తలపించేలా నిర్మించిన అత్యాధునిక డిజిటల్ గ్రంథాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. సత్తుపల్లిలో నిర్మించిన ఈ గ్రంథాలయం వద్ద ఆదివారం ఉదయం ఎంపీ పూజలు చేసిన అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థకు అప్పగించనున్నారు. ఇక్కడ 12 కుంటల భూమిలో రెండంతస్తుల్లో భవనాన్ని నిర్మించారు. ఇందులో రెండు కాన్ఫరెన్స్ హాళ్లు, డిజిటల్ లైబ్రరీ ఉండడమే కాక ఇతర వసతులు సమకూర్చారు.

ఎంపీ సంకల్పం.. విద్యార్థులకు విజ్ఞానం

ఎంపీ బండి పార్థసారధిరెడ్డి సత్తుపల్లిలో చదువుకోగా, ఇక్కడి జ్ఞాపకాలను పలుమార్లు గుర్తుచేసుకుంటారు. ఈ ప్రాంత విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడాలనే సంకల్పంతో రాజ్యసభ సభ్యుడి హోదాలో తొలిసారి సత్తుపల్లికి వచ్చినప్పుడు గ్రంథాలయ నిర్మాణానికి హామీ ఇచ్చారు. అన్ని సౌకర్యాలు, అవకాశాలు కల్పిస్తే ఇక్కడ విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణిస్తారనే సంకల్పంతో రూ.2కోట్ల నిధులతో లైబ్రరీని నిర్మించగా ఆదివారం విద్యార్థి లోకానికి అంకితం ఇవ్వనున్నారు. ఇక్కడ ఇంటర్నెట్‌తో కూడిన డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను అందుబాటులోకి రానున్నాయి. అంతేకాకుండా ఆహ్లాదం పంచేలా పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వగా, కళాశాలలకు సమీపాన లైబ్రరీ ఉండడంతో విద్యార్థులకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.



ప్రారంభానికి ముస్తాబైన లైబ్రరీ

ఇది ప్రజాస్వామిక తెలంగాణ

ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

సత్తుపల్లి: తొమ్మిదేళ్ల క్రితం భౌగోళిక తెలంగాణను సాధించుకోగా, ఇప్పుడు ప్రజాస్వామిక తెలంగాణ సిద్ధించిందని తెలంగాణ జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. సత్తుపల్లి కళాభారతిలో శనివారం తెలంగాణ తొలి, మలితరం ఉద్యమకారులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. ప్రగతిభవన్ కంచెలను కూలుస్తున్నప్పుడు ప్రజలు తమచుట్టూ కంచెలే తొలగినట్లుగా భావించారని తెలిపారు. ప్రజాభవన్‌కు వేలాది మంది వచ్చి బాధలు చెప్పుకుంటున్నారన్నారు. హైదరాబాద్‌లో ధర్నాచౌక్‌ను పునరుద్ధరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం ద్వారా సమస్యలపై గొంతుక వినిపించే అవకాశం కల్పించిందన్నారు. గత తొమ్మిదేళ్లుగా ఏం కోల్పోయామో అవన్నీ ఈ ప్రభుత్వంలో పొందుతామనే నమ్మకం కలిగిందని కోదండరాం అన్నారు. అందరం కలిసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని తెలిపారు. కాగా, సత్తుపల్లి జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను పంగిశ సామేలు, నిమ్మటూరి రామకృష్ణ, వనమారెడ్డి చెంచిరెడ్డి వివరించారు. ఈకార్యక్రమంలో చిత్తలూరి ప్రసాద్, కూకలకుంట రవి, ఆదిల్‌షరీఫ్, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, రామిశెట్టి సుబ్బారావు, గాదె చెన్నారావు, నాగాచారి, మధుసూదన్‌రాజు, పిల్లి మల్లికార్జున్, సాగర్, శరత్, ఏసురత్నం, నాగరాజు, పిచ్చయ్య, అమీరుద్దీన్, గంటా శ్రీను, రాము, రంగరాజు, ధర్మార్జున్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

భద్రగిరిలో భక్తుల కోలాహలం

- నృసింహ రూపుడైన భద్రాద్రి రామయ్య
- దర్శనానికి బారులుదీరిన భక్తులు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశీ ప్రయుక్త అధ్యయనోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజైన శనివారం స్వామివారు నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి మూలమూర్తులకు అంతరాలయంలో, ఉత్సవ మూర్తులను నృసింహావతారంలో అలంకరించి బేడా మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు 200 పాశురాల ప్రబంధాలు పఠించారు. నరసింహావతారంలో స్వామిని ప్రత్యేక పల్లకీపై కోలాట ప్రదర్శనలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి మిథిలా స్టేడియంలో వేంచేపు చేశారు. స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు అవతార విశిష్టతను వివరించారు. స్వామివారు భక్తుల పూజలందుకున్న అనంతరం తిరువీధి సేవ గావించారు.

గ్రామరక్షకుడిగా స్వామివారు..

నరసింహావతారంలో ఉన్న స్వామివారిని గ్రామ రక్షణార్థం తిరువీధి సేవ కొనసాగించడం ఈ అవతారం ప్రత్యేకత అని వేదపండితులు తెలిపారు. గ్రామంలోకి ఎలాంటి దుష్టశక్తులు రాకుండా, ఎలాంటి ఆపదలు సంభవించకుండా ఉండేందుకే నరసింహావతారంలో స్వామి వారు పురవీధుల్లో సంచరిస్తారని వివరించారు. నరసింహావతారంలో రెండు ముఖాలు కలిగి ఉండి భక్తులకు దర్శనమివ్వటం ఈ అలంకార విశిష్టత అని తెలిపారు.

లక్ష్యం.. శతశాతం!



రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

- ఎస్సెస్సీ ఫలితాలపై అధికారుల ప్రత్యేక దృష్టి
- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దేలా కార్యాచరణ
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

ఖమ్మంసహకారనగర్: ఈ ఏడాది పదో తరగతి ఫలితాలపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థి భవితకు బాటలు వేసే ఎస్సెస్సీలో అత్యధిక మార్కులు సాధించేలా ఇప్పటినుంచే శ్రద్ధ వహిస్తున్నారు. ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదు కావాలనే లక్ష్యంతో వచ్చే మార్చిలో జరగనున్న పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. సిలబస్ త్వరగా పూర్తి చేసి, ఆపై రివిజన్ చేయించాలని నిర్ణయించి ప్రత్యేక తరగతులు మొదలుపెట్టారు.

8,650మంది

జిల్లాలోని 212 ప్రభుత్వ పాఠశాలల్లో 8,650విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరందరూ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశాల మేరకు మెరుగైన ఫలితాలు నమోదయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు, పరీక్షలు

విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని భావించిన అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం గంట చొప్పున ఈ తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు చదివిస్తూనే వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అలాగే, ఒక రోజు ఏ సబ్జెకుతరగతి కొనసాగిందో, ఆ సబ్జెక్టు పరీక్ష మరుసటి రోజు ఉదయం నిర్వహిస్తున్నారు. అందులో వచ్చిన మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ‘లక్ష్య’ పేరిట చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా సబ్జెక్టుల వారీగా ముఖ్యాంశాలతో ముద్రించిన పుస్తకాల ఆధారంగా బోధన సాగిస్తుండడంతో మంచి ఫలితాలు వచ్చే అవకాశముందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఫలితాల పెంపు కోసం



ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంది. ఈ తరగతుల్లో విద్యార్థుల సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. తద్వారా గతంలో కంటే ఉత్తీర్ణత పెరుగుతుంది.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

శ్రద్ధగా చదువుకుంటున్నాం



పాఠశాలలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో మా సందేహాలను నివృత్తి చేసుకుంటూ శ్రద్ధగా చదువుకుంటున్నాం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మా వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తున్నారు.

– పి.తేజస్విని, రాజేంద్రనగర్ హైస్కూల్, ఖమ్మం

సందేహాలు నివృత్తి చేస్తున్నారు..



ప్రత్యేక తరగతుల ద్వారా సందేహాలు నివృత్తి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి అందులో వచ్చిన మార్కుల ఆధారంగా వెనుకబడిన సబ్జెక్టులు మళ్లీ బోధిస్తున్నారు. ఇవన్నీ మేం మంచి మార్కులు సాధించేందుకు దోహదపడతాయి.

– పి.శివచరణ్, రిక్కాబజార్ హైస్కూల్, ఖమ్మం

ప్రత్యేక తరగతులతో ఉత్తీర్ణత



పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. తద్వారా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగముంటుంది. విద్యార్థులు సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలు నిర్వహించి పట్టు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నాం.

– కనపర్తి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం, నాగులవంచ

క్లుప్తంగా

నేడు జిల్లాకు మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆది, సోమవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం రాత్రి 8 గంటలకు సత్తుపల్లి నియోజకవర్గంలోని గంగారానికి మంత్రి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నాక బూర్గంపాడు మండలం సారపాకలోకి ఐటీసీ గెస్ట్‌హౌజ్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. ఇక సోమవారం ఉదయం భద్రాచలంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి తుమ్మల తిరిగి హైదరాబాద్ వెళ్తారు.

జాబ్‌మేళాలో 25 మందికి ఉద్యోగాలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ మేళా నిర్వహించగా 46 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో 25మందిని ఎంపిక చేసినట్లు కంపెనీ బాధ్యులు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

20న జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ ఎంపిక పోటీలను ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎండీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్–16, 18, 20, పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 23వ తేదీన కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

23 నుంచి రాష్ట్ర స్థాయి బాలికల క్రికెట్ పోటీలు



క్రికెట్ మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పీఈటీలు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం గౌతమీనగర్ కాలనీలో ఈనెల 23 నుంచి నాలుగు రోజులపాటు 67వ రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్–17 బాలికల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఈమేరకు జిల్లాపాఠశాలల క్రీడల కార్యదర్శి స్టెల్లా జ్ఞానవతి ఆధ్వర్యాన శనివారం క్రికెట్ మైదానాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం స్టెల్లా మాట్లాడుతూ.. క్రికెట్ పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి జట్లు హాజరవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ కందుల శ్రీనివాసరావు, క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలెబోయిన అనిల్‌కుమార్, పీఈటీలు వీరన్న, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఏటీడీఓ డిప్యూటేషన్ రద్దు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఏటీడీఓ)గా విధులు నిర్వర్తిస్తున్న గ్రేడ్–1 వసతిగృహ సంక్షేమాధికారి ఎస్.తిరుమలరావు డిప్యూటేషన్‌ను రద్దు చేశారు. ఈమేరకు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో వైరా అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్‌కే.జహీరుద్దీన్‌కు బాధ్యతలు అప్పగించగా, తిరుమలరావును పాల్వంచ షెడ్యూల్ ట్రైబల్ బాయ్స్ హాస్టల్‌కు కేటాయించారు.

ఆర్‌టీఐపై శిక్షణ

ఖమ్మం సహకారనగర్: అంగన్‌వాడీ టీచర్లకు ఆర్‌టీఐపై ఖమ్మంలోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో శనివారం శిక్షణనిచ్చారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించి అంగన్‌వాడీ టీచర్లకు ఆర్‌టీఐ చట్టంపై ట్రెయినర్ ఆనంద్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



గర్భిణి వివరాలు ఆరా తీస్తున్న డీడబ్ల్యూఓ సుమ

ముదిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని జిల్లా సంక్షేమాధికారి సుమ సూచించారు. మండలంలోని ముదిగొండ, వెంకటాపురం, సువర్ణాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా టాయిలెట్ల నిర్మాణం, న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆతర్వాత వెంకటాపురంలో పలువురు గర్భిణుల ఇళ్లకు వెళ్లి పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సీడీపీఓ కమలప్రియ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సంధ్యారాణి, సావిత్రి, సర్పంచ్ మందరపు లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ కనపర్తి కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలి

- భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్
- ముగిసిన గిరిజన ఆశ్రమ పాఠశాలల క్రీడోత్సవాలు
- ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన దమ్మపేట జోన్



దమ్మపేట జోన్‌కు ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీ అందజేస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

పాల్వంచ: గిరిజన, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు చదువులో రాణిస్తూనే క్రీడల్లో కూడా అత్యున్నత స్థాయికి ఎదగాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆకాంక్షించారు. పాల్వంచ మండం కిన్నెరసానిలోని మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఐటీడీఏ పరిధి పాఠశాలల క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఎనిమిది క్రీడాంశాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఏడు జోన్ల నుంచి 674 మంది బాలురు, 621 మంది బాలికలు పాల్గొనగా విజేతలకు పీఓ. బహుమతులు అందజేసి మాట్లాడారు.

సాధనతో విజయం..

క్రీడల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు నిత్య సాధన అవసరమని పీఓ ప్రతీక్ తెలిపారు. గెలుపోటములు సహజమని.. నిరంతరం సాధన చేయడం ద్వారా విజయాలు సొంతమవుతాయని చెప్పారు. ఈ విషయంలో విద్యార్థులను అధికారులు, అధ్యాపకులు, క్రీడా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. కాగా, పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను దమ్మపేట జోన్ కైవసం చేసుకోగా, ప్రతిభ కనబర్చిన 224 మంది బాలికలు, 224 మంది బాలురను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో భద్రాచలం, ఖమ్మం డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, అధికారులు ఎస్.చంద్రమోహన్, పి.నరసింహారావు, బి.రూపాదేవి, కె.జహీరుద్దీన్, తిరుమల్‌రావు, కె.రమణయ్య, మంగతాయారు, బి.గోపాల్‌రావు, కె.వెంకటనారాయణ, ఎస్.నాగేశ్వరరావు, బి.రాంబాబు, బి.నెహ్రూ, వీరూనాయక్, బి.వెంకటేశ్వర్లు, బాలసుబ్రహ్మణ్యం, హరికృష్ణ, కె.వెంకటేశ్వర్లు, రామారావు, గోపాల్‌రావు, శిరోమణి, ఈశ్వర్‌రావు, మోతీలాల్, ముత్తయ్య, కృష్ణారావు, చందు, భద్రు, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

చివరి రోజు విజేతలు వీరే..

సీనియర్స్ బాలికల విభాగం నుంచి వాలీబాల్‌లో ఇల్లెందు, దుమ్ముగూడెం, మణుగూరు జోన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కబడ్డీలో ఇల్లెందు, దుమ్ముగూడెం, వైరా, ఖో–ఖోలో మణుగూరు, ఇల్లెందు, వైరా, టెన్నీకాయిట్‌లో వైరా, ఖమ్మం, మణుగూరు మొదటి మూడు స్థానాల్లో నిలవగా, ఆర్చరీలో ఇల్లెందు, దుమ్ముగూడెం క్రీడాకారులు మొదటి, రెండో స్థానాల్లో నిలిచారు. జూనియర్స్ బాలికల విభాగం నుంచి వాలీబాల్‌లో దమ్మపేట, దుమ్ముగూడెం, వైరా, ఖో–ఖోలో దుమ్ముగూడెం, ఇల్లెందు, వైరా మొదటి మూడు స్థానాల్లో నిలవగా, టెన్నీకాయిట్‌లో దమ్మపేట, వైరా, ఆర్చరీలో ఇల్లెందు, దుమ్ముగూడెం క్రీడాకారులు మొదటి, రెండు స్థానాలు దక్కించుకున్నారు.



అండర్–17 ఖో-ఖో విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న పీఓ



అండర్–14 ఖోఖో విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న పీఓ

కలెక్టర్‌ను కలిసిన విద్యార్థినులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న విద్యార్థినులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు పలువురు శనివారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను కలిశారు. కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకుడు వేణును తమ కళాశాలలోనే కొనసాగించేలా చూడాలని విన్నవించారు. రెండు రోజులుగా కళాశాలలో గొడవలు జరుగుతుండగా, ఇంగ్లిష్ అధ్యాపకుడిపై అక్రమంగా కేసులు నమోదు చేశారని తెలిపారు. ఆయననే కెమిస్ట్రీ లెక్చరర్ విజయలక్ష్మి కొట్టగా, వేణును కొనసాగించాలని తాము ఆందోళన చేస్తే ఆమె తన భర్తతో కలిసి పోలీసులను పిలిపించి బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. ఈమేరకు తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

కల్లూరు వాసికి డాక్టరేట్



శీలం రామారావు

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన శీలం రామారావుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. 'ఇకలాజికల్ ఇంప్లికేషన్స్ అండ్ కన్జర్వేషన్ స్ట్రాటజీస్ ఆఫ్ కొండగట్టు హిల్ ఫారెస్ట్ తెలంగాణ – ఇండియా'అంశంపై ఆయన ప్రొఫెసర్ డాక్టర్ ఎ.విజయభాస్కర్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించారు. బాసర ట్రిపుల్ ఐటీలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు డాక్టరేట్ లభించడంపై ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ ఆచార్య సతీష్‌కుమార్ అభినందించారు.

కరుణగిరి చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న బిషప్ ఉడుముల బాల, తదితరులు

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేటలో గల కరుణగిరి చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి బిషప్ ఉడుముల బాల క్రిస్మస్ కేక్ కట్ చేసి మాట్లాడారు. సర్వమానవాళికి శాంతిని ప్రసాదించడానికి యేసు ప్రభు వచ్చారని తెలిపారు. ప్రజలంతా ఐకమత్యం పెంపొందించుకోవడమే కాక సోదరభావం, ప్రేమను కలిగి సమాజాభివృద్ధిని సాధించాలని సూచించారు. అనంతరం సంఘం పెద్దలు బిషప్‌ను సన్మానించారు. ఈకార్యక్రమంలో కొమ్ము ప్రసాద్, పి.సుందరి, వరప్రసాదరాజు, గోవా శౌరయ్య, డేవిడ్ ఇమ్మానియేల్, బాలస్వామి, జనార్దన్, బాబురావు, సుదర్శనం, రామకృష్ణ, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నవల్లి గుట్టల్లో బొగ్గు బట్టీ



బట్టీని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు


కల్లూరురూరల్: మండలంలోని వెన్నవల్లి గుట్టల సమీపాన కొందరు కలపకు నిప్పంటించి బొగ్గు తయారు చేస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు శనివారం అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు నాలుగైదు నెలల క్రితం బట్టీ ఏర్పాటు చేసుకుని బొగ్గు తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎఫ్‌ఆర్‌ఓ అరవింద్, డీఆర్‌ఓ నాగమణి, బీట్ ఆఫీసర్లు భీమా, కేశవరావు వెళ్లి విచారణ జరిపారు. అక్రమంగా బొగ్గు తయారు చేస్తున్న వ్యక్తులపై అటవీశాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

ఏపీ పోలీసుల అదుపులో నాచేపల్లి యువకుడు

యువతి మిస్సింగ్ కేసులో విచారణ

నేలకొండపల్లి: సామాజిక మాధ్యమాల ద్వారా జిల్లాకు చెందిన ఇద్దరు యువకులకు ఏపీకి చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడగా తరచు ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఇందులో ఓ యువకుడు ఆమెను కలిశాక ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. వివరాలిలా.. నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి, ముదిగొండ మండలానికి చెందిన ఇద్దరు యువకులకు ఏపీలోని విజయవాడకు చెందిన ఓ యువతి సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైంది. ఇరువురు ఆమెతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండగా, రెండు రోజుల క్రితం నాచేపల్లి యువకుడు విజయవాడకు వెళ్లి ఆమెను కలిసి వచ్చినట్లు తెలిసింది. ఆతర్వాత ఆమె ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కిడ్నాప్ కేసు నమోదు కాగా, ఆమె ఫోన్ డేటా పరిశీలించిన పోలీసులకు నాచేపల్లి, ముదిగొండ యువకుడు ఎక్కువ సార్లు మాట్లాడినట్లు తేలింది. దీంతో విజయవాడ పోలీసులు శనివారం నాచేపల్లికి వచ్చి యువకుడిని అదుపులోకి తీసుకుని నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో విచారించగా యువతిని కలిసింది నిజమే అయినా ఆమెను తీసుకురాలేదని తెలిపాడు. అలాగే, ముదిగొండ మండలానికి చెందిన యువకుడిని కూడా విచారించారు. ఈ విషయమై నేలకొండపల్లి ఎస్సై బి.సతీష్‌ను వివరణ కోరగా... విజయవాడ పోలీసులు విచారణ కోసం నాచేపల్లి యువకుడిని తీసుకెళ్లారని తెలిపారు.

బొగ్గు లారీ బోల్తా..



మిట్టపల్లి వద్ద పల్టీ కొట్టిన లారీ

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి సమీపాన శనివారం బొగ్గు లారీ బోల్తా పడింది. టైర్ పంక్చర్ కావడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న లారీ బోల్తా పడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనతో ట్రాఫిక్ నిలిచిపోగా, తల్లాడ పోలీస్ కానిస్టేబుల్ బాలాజీ తదితరులు చేరుకుని లారీనీ తీయించాక వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించారు.

శుభలేఖలు ఇచ్చి వెళ్తూ మృత్యుఒడికి..

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి గాయాలు

సత్తుపల్లిరూరల్: బంధువుల ఇంట్లో పెళ్లి జరగనుండగా శుభలేఖలు ఇచ్చి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మధిర మండలం కంభంపాడు గ్రామానికి చెందిన షేక్ రాంబాబు(56), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం ఎర్రగుంటకు చెందిన నాగుల్‌మీరా తమ బంధువుల పెళ్లి కార్డులను శనివారం సత్తుపల్లిలో పలువురికి అందజేశారు. అనంతరం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సత్తుపల్లి మండలం కిష్టారం వై జంక్షన్ వద్ద వీరి వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందగా, నాగుల్‌మీరాకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, రాంబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా ఘటనపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాలీ క్లీనర్ మృతి

లారీని బోలెరో ట్రాలీ ఢీకొనడంతో ఘటన



లారీని ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన బోలెరో ట్రాలీ

కామేపల్లి: ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు బోలెరో ట్రాలీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం చర్లపల్లికి చెందిన డ్రైవర్ గోగుల సాయి, క్లీనర్ అయ్యప్ప మాలధారి కుర్సం వెంకన్న(40) బోలెరో ట్రాలీలో బ్రాయిలర్ కోళ్లు వరంగల్‌లో లోడ్ చేసుకుని శనివారం తెల్లవారుజామున ఖమ్మం జిల్లా ఏన్కూర్ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో కామేపల్లి మండలం మద్దులపల్లి సమీపాన రోడ్డుపై ఎలాంటి సిగ్నల్ లేకుండా లారీని డ్రైవర్ బనాల కృష్ణ నిలిపిఉంచాడు. మంచు కారణంగా లారీ సరిగ్గా కనిపించకపోవడంతో ట్రాలీ వెనుక నుంచి ఢీకొనగా డ్రైవర్ పక్కన కూర్చున్న కుర్సం వెంకన్నకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ఘటనలో డ్రైవర్ సాయికి తీవ్ర గాయాలుకాగా, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడు వెంకన్నకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు..

కామేపల్లి: ప్రమాదవశాత్తు వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటన తాళ్లగూడెం పెద్దమ్మ గుడి సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరిగడ్డి లోడ్‌తో కారేపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఖమ్మం నుంచి కారేపల్లి వైపు వస్తున్న మాధారం ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆ ట్రాక్టర్ పంట పొలాల్లోకి దూసుకెళ్లగా.. ప్రమాదంలో ఎవరికి ఏమీ కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

వైభవంగా అయోధ్య అక్షింతల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో ఆలయ ప్రతిష్ఠాపన జరగనుండగా, అక్షింతల కలశ శోభాయాత్ర శనివారం ఖమ్మంలో కనుల పండువగా సాగింది. కాల్వొడ్డు శ్రీ సత్య నారాయణ సహిత ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అక్షింతల కలశానికి పూజలు నిర్వహించగా, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం పాట్టి శ్రీరాములు రోడ్, గాంధీచౌక్, కమాన్ బజార్, జీవీ మాల్ రోడ్, పాత మున్సిపాలిటీ ఆఫీస్, వైరారోడ్, జెడ్పీ సెంటర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి రోడ్ మీదుగా జలాంజనేయ స్వామి దేవాలయానికి యాత్ర చేరగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిర్వహణ ప్రతినిధులు బోనాల రామకృష్ణ, నేరెండ్ల శ్రీనివాస్, పోలా శ్రీనివాస్, బొడ్డు కృష్ణ, పి.బాలాజీ, పి.రవి, బి.కిషోర్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ బాధ్యులు కె.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా... ఉత్కంఠగా

కొనసాగుతున్న రీజినల్ స్థాయి సెయింట్ ఆన్స్ పోటీలు



బాలుర వాలీబాల్ మ్యాచ్ దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: సెయింట్ ఆన్స్ పాఠశాలల రీజినల్ స్థాయి క్రీడా పోటీలు ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో కొనసాగుతున్నాయి. ఈ పోటీల్లో 27 సెయింట్ ఆన్స్ పాఠశాలల నుంచి జట్లు పాల్గొంటున్నాయి. అథ్లెటిక్స్ బాలబాలికల పోటీలు సెమీఫైనల్స్‌కు చేరుకోగా, ఖో–ఖో, బాస్కెట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ పోటీలు లీగ్ దశలో ఉన్నాయి. కాగా, టోర్నీని మరియ సుందరి, నక్షత్రం పర్యవేక్షిస్తున్నారు. కాగా, శనివారం జరిగిన వాలీబాల్ లీగ్ పోటీల బాలుర విభాగంలో ఖమ్మంపై హుజూర్‌నగర్, చెన్నైపై ఏలూరు, నూతనకల్‌పై చెన్నై, బనిగండ్లపాడుపై ఏలూరు జట్లు విజయం సాధించాయి. బాలికల విభాగంలో ఏలూరుపై సికింద్రాబాద్, వైజాగ్‌పై మంగళగిరి, వైజాగ్‌పై నల్లగొండ జట్లు గెలిచాయి. బాలికల త్రోబాల్‌లో విసన్నపేటపై ప్రసాదంపాడు, సికింద్రాబాద్‌పై ఖమ్మం, పెద్దఅవుతుపల్లిపై హుజూర్‌నగర్, ఖో–ఖో బాలురలో వైజాగ్‌పై ఖమ్మం, పెద్దఅవుతపల్లిపై సూర్యాపేట, నల్లగొండ నూతనకల్, బాలికల్లో ప్రసాదంపాడుపై నూతనకల్, హుజూర్‌నగర్‌పై సూర్యాపేట, నందిగామపై మంగళగిరి విజయం సాధించాయి. ఇక కబడ్డీ బాలుర విభాగంలో మఠంపల్లిపై సూర్యాపేట, ప్రసాదంపాడుపై హుజూర్‌నగర్, మఠంపల్లిపై నూతనకల్ జట్టు విజయం సాధించింది.

జాతీయస్థాయి అడ్వెంచర్ శిబిరానికి ఎంపిక



ఇందుప్రియను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఇందుప్రియ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన జరిగే జాతీయస్థాయి అడ్వెంచర్ శిక్షణ శిబిరానికి ఎంపికైంది. బీజెడ్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆమె జనవరి 1 నుంచి 23వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం ధర్మశాలలో జరిగే శిబిరంలో పాల్గొననుంది. కాకతీయ యూనివర్సిటీ తరఫున ఎంపికైన ఇందుప్రియను ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పద్మావతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాకేశ్, ఎన్ఎస్ఎస్ పీఓలు రాకుమారస్వామి, మార్జియానా, అధ్యాపకులు శనివారం అభినందించారు.